నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 11 జనవరి 2024 | NIZAMABAD

**తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పట్టు..**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామంటున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తమకు అవకాశం లభిస్తుందో లేదోనని గృహలక్ష్మి లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో న్యాయం చేస్తామనే భరోసా ఏదీ కొత్త ప్రభుత్వం నుంచి రాలేదు. తమను కొత్త ప్రభుత్వంలో లబ్ధిదారులుగా గుర్తించే ప్రకటన చేస్తుందేమోనని ఆశగా ఎదురు చూస్తూ వచ్చినా ఎలాంటి ప్రకటనా రాలేదు. దీంతో బుధవారం తహసీల్ కార్యాలయాల ఎదుట నిరసనకు దిగారు. బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని తహసీల్ కార్యాలయాల వద్దకు లబ్ధిదారులు తరలివచ్చి ధర్నాకు దిగారు. తమను ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తొలి లబ్ధిదారులుగా ప్రాధాన్యతనిస్తూ గుర్తించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ మేరకు తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఇదివరకే కేసీఆర్ ప్రభుత్వంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మంజూరైన ప్రజల సామూహిక అవసరాల అభివృద్ధి పనులను కొత్త ప్రభుత్వం రద్దు చేయడంతో ఆందోళనగా ఉన్న ప్రజలు.. తాజాగా గృహలక్ష్మి మంజూరీలను రద్దు చేయటంతో మరింత డీలా పడిపోయారు.



మోర్తాడ్ తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

**‘ఇందిరమ్మ ఇండ్ల’లో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్**
**పేదల కోసం ‘గృహలక్ష్మి’ తెచ్చిన కేసీఆర్ ప్రభుత్వం**
**ఈ పథకాన్ని రద్దు చేసిన కాంగ్రెస్ సర్కారు**
**సొంతింటి కల తీరదేమోనన్న బెంగలో లబ్ధిదారులు**

# ‘గృహలక్ష్మి’ల ఆందోళన

## తహసీల్ ఆఫీసుల ఎదుట ధర్నా

కమ్మర్‌పల్లి, జనవరి 10: గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేయడంతో లబ్ధిదారులు బుధవారం ఆందోళనకు దిగారు. తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నాకు దిగారు. పథకాన్ని కొనసాగించాలని లేదంటే ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తే అందులో తమకు తొలి ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. బాల్కొండ నియోజకవర్గంలోని దాదాపు అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట లబ్ధిదారుల నిరసన కార్యక్రమాలు కొనసాగాయి.

**పేదల సొంతింటి కల తీర్చేందుకు..**

పోరాడి సాధించుకున్న తెలంగాణలో సొంతిల్లు లేని వారు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. రెండు పడక గదులు, హాల్, కిచెన్‌తో కూడిన ఇంటిని నిర్మించి పేదలకు అందించే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అవకాశమున్న చోట, నిర్మాణానికి స్థల లభ్యత దొరికిన చోట విడతల వారీగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాలను నిర్మించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలను పారదర్శకంగా పూర్తి చేసి, ఇండ్లను అప్పగించింది. డబుల్ బెడ్‌రూం పథకం కింద ఉమ్మడి జిల్లాలో వేలాది మంది పేదల సొంతింటి కల నెరవేరింది.

### రద్దు చేసిన కాంగ్రెస్ సర్కారు..

ఇంటి నిర్మాణాలు ప్రారంభించే లోపే శాసనసభ ఎన్నికల కోడ్ వచ్చింది. ఎన్నికల తర్వాత తమకు మంజూరైన ఇండ్లను నిర్మాణాన్ని ప్రారంభించుకోవాలని లబ్ధిదారులు భావించారు. అయితే, తమ సొంతింటి కల తీరబోతున్నదన్న ఆనందంలో ఉన్న పేదలకు.. నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కార్ షాకిచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన గృహలక్ష్మి ఇండ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో గృహలక్ష్మి లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. సొంతింటి కల తీరబోతుందన్న ఆనందం కొద్ది రోజులైనా లేకుండా పోవడంతో నిరాశ మొదలైంది.




### జాగా ఉన్న వారికి ‘గృహలక్ష్మి’..

మరోవైపు, సొంత జాగా ఉండి, ఇల్లు లేని పేదల కోసం కేసీఆర్ సర్కారు గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చింది. ఇల్లు నిర్మాణానికి రూ.3లక్షలు ఆర్థిక సాయాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. నియోజకవర్గానికి 3 వేల మందికి ఇందిరమ్మ ఇండ్ల పథకం అందించేలా కార్యాచరణ రూపొందించింది. ఆ మేరకు అన్ని నియోజకవర్గాల్లో జాగా ఉండి ఇల్లు లేని పేదలను గుర్తించి ఇళ్లను మంజూరు చేసింది. గ్రామ గ్రామాన ఎంతో మంది ఈ పథకానికి ఎంపిక కాగా, ప్రొసిడింగ్ కాపీల అందజేత కూడా పూర్తయింది.



ముప్కాల్ తహసీల్దార్ వనజారాణికి వినతిపత్రం అందజేస్తున్న గృహలక్ష్మి లబ్ధిదారులు



ఇండ్ల మంజూరు పత్రాలతో భీమ్‌గల్ తహసీల్ కార్యాలయానికి తరలివచ్చిన లబ్ధిదారులు



బాల్కొండలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గృహలక్ష్మి లబ్ధిదారులు

---

గుడ్ న్యూస్



## పెండింగ్ చలాన్ల రాయితీ గడువు పొడిగింపు..

**ఈ నెల 31వరకు అవకాశం**

నిజామాబాద్ క్రైం,జనవరి 10: వాహనదారుల పెండింగ్ చలాన్ల చెల్లింపు గడువు తేదీని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 25వ తేదీ వరకు ఉన్న పెండింగ్ చలాన్లపై రాయితీని ఈ నెల 10వ తేదీ వరకు చెల్లించుకునే అవకాశం కల్పించిన విషయం తెల్సిందే. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చాలా మంది వాహనదారులు పెండింగ్ చలాన్లను రాయితీతో చెల్లించారు. కాగా సాంకేతిక సమస్యతో కొందరు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి అవకాశం ఇస్తూ ఈ నెల 31వ తేదీ వరకు రాయితీతో కూడిన పెండింగ్ చలాన్లను చెల్లించాలని సూచించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు.

## కల్యాణలక్ష్మితో పేద కుటుంబాలకు ఆసరా

**లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి**



బీబీపేట్‌లో జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి / బీబీపేట్ / మాచారెడ్డి / దోమకొండ/ భిక్కనూరు/ రాజంపేట్, జనవరి 10 : కామారెడ్డి నియోజకవర్గంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. జిల్లాకేంద్రంతోపాటు బీబీపేట్, మాచారెడ్డి, దోమకొండ, భిక్కనూరు, రాజంపేట్ మండలాల్లో బుధవారం పర్యటించి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి పథకం ఆడపిల్లలు ఉన్న పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నదని అన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామని అన్నారు.



పెద్ద కొడప్‌గల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

## అర్హులకు సంక్షేమ పథకాలు

**జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు**

మద్నూర్/ పెద్దకొడప్‌గల్ / డోంగ్లీ, జనవరి 10 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మద్నూర్, పెద్దకొడప్‌గల్, డోంగ్లీ మండలాల్లో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యే.. పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారెంటీలను అర్హులకే అందజేస్తామన్నారు. మద్నూర్‌లో 52, పెద్దకొడప్‌గల్‌లో 11, డోంగ్లీలో 20 చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో..

## పాఠశాలల్లో సంక్రాంతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. బుధవారం పలు పాఠశాలల్లో విద్యార్థులపై భోగి పండ్లు పోశారు. విద్యార్థులు హరిదాసు వేషధారణతో ఆకట్టుకున్నారు.



నిజాంసాగర్ కేజీబీవీలో..



బోధన్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చిన్నారులకు భోగి పండ్లు..

---

## తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు

**నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశం**



నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 10 : జిల్లావ్యాప్తంగా ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రానున్న వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, వారం రోజుల్లో నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, సమస్యలుఉన్నచోట యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి, లోపాలను సరిచేయాలన్నారు. ప్రజాపాలన సభల సందర్భంగా పలుచోట్ల తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు అందినట్లు చెప్పారు.

వేసవి కాలం ఆరంభానికి ముందే నివాసాల వారీగా వ్యవస్థను చక్కదిద్దాలని ఆదేశించారు. సర్పంచులు, కార్యదర్శులను సంప్రదించి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లకు సమృద్ధిగా శుద్ధజలాలు అందేలా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేంద్ర కుమార్, ఈఈలు రాకేశ్, నరేశ్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## వేగవంతంగా మిల్లింగ్ చేపట్టాలి

**కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**



మద్దెల్‌చెరువులో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

పిట్లం/మద్నూర్/ నిజాంసాగర్, జనవరి 10: జిల్లాలోని రైస్‌మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని నెలాఖరులోగా మిల్లింగ్ చేపట్టాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. పిట్లం మండలం మద్దెల్‌చెరువు గ్రామంలోని బిలాల్ రైస్‌మిల్‌ను బుధవారం తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం నిల్వ ఉండడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు, పిట్లం ఇన్‌చార్జి తహసీల్దార్ నాగేశ్, ఆర్ఐ శీతల్ ఉన్నారు. నిజాంసాగర్, మద్నూర్ మండలాల్లో చేపడుతున్న ప్రజాపాలన డాటాఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవోలు నాగేశ్వర్‌రావు రవీశ్వర్‌గౌడ్ ఉన్నారు.

## అతివలతో.. బురిడీ..

**ఓటీపీ చెప్పడంతో ఖాతాలోంచి రూ.10వేలు ఖాళీ**
**ప్రజాపాలన దరఖాస్తుదారులకు టోకరా**
**మహిళలను రంగలోకి దించిన సైబర్ మోసగాళ్లు**
**రేషన్‌కార్డులో తప్పులు ఉన్నాయంటూ సంభాషణ**



నిజామాబాద్ క్రైం, జనవరి 10: సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. అమాయకులే లక్ష్యంగా చేసుకొని బురిడీ కొట్టిస్తున్నారు. మాటల గారడీ చేసి ఖాతాలు కొల్లగొడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం మాటున కుచ్చు టోపీ వేస్తున్నారు. అభయహస్తం ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తుదారులంతా మహిళలే కావడంతో సైబర్ నేరగాళ్లు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మాయమాటలు చెప్పి బ్యాంకు ఖాతాలోని డబ్బులను కాజేసేందుకు వల వేస్తున్నారు. తాజాగా నిజామాబాద్ జిల్లాలో సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది.

**రేషన్‌కార్డు దరఖాస్తులో తప్పులున్నాయంటూ..**

నాలుగు రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్ధీపూర్ గ్రామానికి చెందిన లావణ్య అనే మహిళకు గుర్తుతెలియని మహిళ ఫోన్ చేసింది. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, మీరు చేసుకున్న రేషన్‌కార్డు దరఖాస్తులో తప్పులు ఉన్నాయంటూ మాట కలిపింది. వాటిని సరిచేయాలంటే మీ ఫోన్‌కు వచ్చే ఓటీపీని చెప్పాలంటూ అడగడంతో లావణ్య అందుకు అంగీకరించి ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెప్పింది. దీంతో డిచ్‌పల్లి ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఉన్న ఆమె ఖాతాలోంచి రూ.10వేలు డ్రా చేసినట్లుగా మెస్సేజ్ వచ్చిందని లావణ్య చెప్పింది.

**ఐదు నిమిషాల్లో మూడుసార్లు...**

నిజామాబాద్ నగరంలోని గాయత్రీ నగర్‌కు చెందిన మరో మహిళకు సైతం గుర్తుతెలియని మహిళ ఫోన్ చేసింది. మీ వివరాలు చెప్పండి అంటూ అడగడంతో దరఖాస్తు చేసుకున్న మహిళ వెంటనే కాల్ కట్ చేసింది. మళ్లీ ఐదు నిమిషాలకు కాల్ చేసి అదే తరహాలో వివరాలు అడగగా, దరఖాస్తుదారు కాల్ కట్ చేసింది. కొద్ది క్షణాల్లోనే మూడోసారి ఫోన్ రావడంతో సదరు మహిళను గట్టిగా నిలదీసింది. దీంతో ఆ అపరిచితురాలు కాల్ కట్ చేసిందని దరఖాస్తుదారు తెలిపింది.



**రేషన్ కోసం బారులు..**

రేషన్ షాపుల ఎదుట జనం బారులు తీరుతున్నారు. వాస్తవానికి ఈ నెల బియ్యం పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. దీనికి తోడు సంక్రాంతి పండుగ వస్తున్న తరుణంలో ప్రజలు బియ్యం కోసం రేషన్‌షాపుల ఎదుట క్యూ కడుతున్నారు. బుధవారం రాత్రి సమయంలోనూ నిజామాబాద్ నగరంలోని దుబ్బరోడ్‌లో గల ఓ షాపు ఎదుట పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు బారులు తీరి కనిపించారు. – నిజామాబాద్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ

19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
శ్రీ రాఘవేంద్ర కిడ్నీ & యూరో కేర్ సెంటర్
డోర్ నెం.5-7-34,అమృత సిటిస్కాన్ వెనుక, ఇండియన్ బ్యాంక్ ఎదురుగా, ఖలీల్‌వాడి
నిజామాబాద్ ఫోన్: 08462-220470, సెల్ : 98487 42994
చికిత్సా వసతులు
RIRS-Laser : మూత్రపిండం రాళ్ళకు రంధ్రం లేకుండా, లేజరుతో రాళ్ళు కరిగించబడును.
TURP : మూత్రనాళం ద్వారా ప్రోస్టేట్ గడ్డను తొలగించడం.
URSL: Ureteroscope పద్ధతిలో మూత్ర పిండం నాళములోని రాయిని కరిగించడం.
PCNL: Nephroscope పరికరముతో మూత్రపిండంలోని పెద్ద రాళ్ళను తీసివేయడం
ESWL : మూత్రపిండంలోని రాళ్ళను ఆపరేషన్ లేకుండా కరిగించడం.
మగవారిలోని సంతానలేమి మరియు వంధత్వముకు చికిత్స పిల్లలలో కలిగే మూత్రపిండ మరియు మూత్ర సంబంధిత వ్యాధులకు చికిత్స
Pyeloplasty : కిడ్నీ వాపుకు శస్త్ర చికిత్స
VIU / OIU : మూత్రనాళంకు శస్త్ర చికిత్స
Vasal Recanalization: Vasectomy తర్వాత మళ్ళీ సంతాన ప్రాప్తికి శస్త్ర చికిత్స
Tubal Recanalization: Tubectomy తర్వాత మళ్ళీ సంతాన ప్రాప్తికి శస్త్ర చికిత్స

డా॥ ఏ.రాఘవేందర్
M.S.(JIPMER), M.Ch.(Osm)
రి.నెం.40351
యూరాలజిస్ట్, లాపరోస్కోపిక్ సర్జన్ & ఆండ్రాలజిస్ట్